క్లుప్తంగా

పారా అథ్లెటిక్స్ విజేతకు సత్కారం



ముత్తుకూరు(పొదలకూరు): ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఉమెన్ గ్రాండ్‌ప్రిక్స్‌లో 100, 200 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకాలను సాధించిన ముత్తుకూరుకు చెందిన భవానీని పట్టణ వాసులు సోమవారం సత్కరించారు. చెక్ రిపబ్లిక్‌లో నిర్వహించిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో ఈమె పాలుపంచుకున్నారు. పరుగు పందెంలో రెండు స్వర్ణాలను సాధించారు. మత్స్యకార కుటుంబానికి చెందిన భవానీ ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో గుర్తింపు తీసుకురావడంతో పట్టణానికి చెందిన ప్రముఖులు సత్కరించారు. 100 మీటర్లను 13.70.. 200 మీటర్లను 29.07 సెకన్లలో ముగించి ప్రథమ స్థానాన్ని సాధించారని వివరించారు.

9న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

ఇందుకూరుపేట: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈనెల 9న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ స్థాయిలో ఈనెల 7న పోటీలు జరిగాయని, గెలుపొందిన వారికి 9న కళాశాల ఆవరణలో జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు 11న బహుమతుల ప్రదానం జరుగుతుందని వివరించారు. పూర్తి వివరాల కోసం 94404 58428, 99890 13303 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

రావి ఆకుపై వైఎస్సార్ చిత్రం



రావి ఆకుపై వైఎస్సార్ బొమ్మ

పొదలకూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావి ఆకుపై వైఎస్సార్ బొమ్మను గీశారు. వైఎస్సార్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..



నెల్లూరు(క్రైమ్): క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని, మీరైనా విచారణ జరిపి న్యాయం చేయాలని పలువురు కోరారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 47 మంది హాజరై తమ సమస్యలను వినతుల రూపంలో కావలి డీఎస్పీ శ్రీధర్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మకు అందజేశారు. వీటిని పరిశీలించిన వారు, ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎస్బీ – 2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- మద్యానికి భర్త బానిసై తనను, పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపి కాపురాన్ని చక్కదిద్దాలని జలదంకికి చెందిన ఓ మహిళ కోరారు.
- అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధిస్తూ, ఇంటి నుంచి ఇటీవల గెంటేశారని, కౌన్సెలింగ్‌ను నిర్వహించి పరిస్థితిని చక్కదిద్దాలని చిన్నబజార్‌కు చెందిన ఓ వివాహిత విజ్ఞప్తి చేశారు.
- ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో పనిచేసుకోలేకపోతున్నామని, కుమారుడు వెంకటేశ్వర్లు పట్టించుకోవడంలేదని, న్యాయం చేయాలని నవాబుపేటకు చెందిన వృద్ధ దంపతులు విన్నవించారు.
- తన పేరుపై ఉన్న ఇంటిని వారి పేరుపై రాసివ్వాలని మనవడు, కోడలు చిత్రహింసలు పెడుతున్నారని, న్యాయం చేయాలని కావలికి చెందిన ఓ వృద్ధురాలు వేడుకున్నారు.
- బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగమిప్పిస్తానని నమ్మించి తిరుపతికి చెందిన జయప్రకాష్ రూ.14 లక్షలు తీసుకొని, ఆపై మోసగించారని, చర్యలు చేపట్టాలని కావలికి చెందిన ఓ వ్యక్తి అభ్యర్థించారు.
- ఆన్‌లైన్ వ్యాపారంలో అధిక లాభాలొస్తాయంటూ రూ.12.7 లక్షల పెట్టుబడులు పెట్టించి ఓ మహిళ మోసగించారని, తగిన చర్యలు చేపట్టలని కందుకూరుకు చెందిన ఓ వ్యక్తి కోరారు.
- పొలం వివాదంలో పొదలకూరుకు చెందిన శ్రీనివాసులు, అతని అనుచరులు తనపై, కుమార్తెపై దాడి చేశారని, చర్యలు చేపట్టాలని వ్యక్తి విజ్ఞప్తి చేశారు.

ఉలికిపడిన జిల్లా















నెల్లూరు నగరంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై టీడీపీ గూండాలు సోమవారం రాత్రి జరిపిన దాడి నేపథ్యంలో నెల్లూరు జిల్లా ఒక్కసారిగా ఉలికిపడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 70 మందికి పైగా టీడీపీ మూకలు ప్రసన్న ఇంటిపై పడ్డారు. విచక్షణ కోల్పోయి ఇంటి ఆవరణలో నిలిపిన కారును ఒక్కసారిగా పైగా లేపి ధ్వంసం చేశారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి కంటికి కనిపించిన సామగ్రిని ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించారు. అడ్డొచ్చిన వారిపై దాడికి పాల్పడుతూ స్వైర విహారం చేశారు. ఘటన తర్వాత ఇంటి ప్రాంగణంతో పాటు లోపల భయానక వాతావరణం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు

బాబు మోసాలు బయట పెడదాం

- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం తప్ప అభివృద్ధి, సంక్షేమ శూన్యం
- కార్యకర్తలు అధైర్య పడొద్దు.. 2029లో మళ్లీ జెండా ఎగుర వేస్తాం
- మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్, చిత్రంలో ప్రసన్న

కోవూరు: ప్రతి ఎన్నికల్లోఅసాధ్యమైన హామీలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచాక వాటిని విస్మరించడం చంద్రబాబుకు అలవాటేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పి.అనిల్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. సోమవారం కోవూరు రుక్మిణి కల్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ ఒకటి రెండు పథకాలు తప్పితే చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏదీ అమలు కాలేదన్నారు. కానీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ఖాతాల్లోకి ప్రతి నెలా నిధులు జమ అయ్యాయన్నారు. ముప్పై లక్షల ఇళ్లు, విద్య, ఆరోగ్య రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించారన్నారు. చంద్రబాబు పాలన అనుచరుల అభివృద్ధికే పరిమితమైందన్నారు. పుట్టపర్తిలో పంటల్ని దున్నేయడం, చెట్లను నరికేయడం వంటి ఘటనలు చంద్రబాబు హయాంలోనే జరిగాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 'రెడ్ బుక్' రాజ్యాంగం అమలవుతోంది. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు హామీల మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్య పడొద్దని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల గుండెల్లోనే ఉన్నాయని, 2029లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగర వేస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే నిజమైన వీరుడు. ఆయనే ఒక్కడిగా పోరాడారు. చంద్రబాబు పొత్తులతో, మాయలతో గెలిచారు. ప్రజలు ఈ విషయం తెలుసుకొని జగన్‌కే మళ్లీ అవకాశం ఇస్తారన్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరూ ఏదో బుక్‌లో రాసిపెట్టుకోవాలని, మనం అధికారంలోకి రాగానే తిరిగి ఇద్దామన్నారు.

అవినీతిలో పీహెచ్‌డీ: ప్రసన్న

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఏడాది కాలంగా అవినీతిలోనే పీహెచ్‌డీలు చేశారని మాజీమంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి విమర్శించారు. ఆమె చేసిన అన్ని పీహెచ్‌డీలు తాను చేయలేదన్నారు. పడుగుపాడు రోడ్డు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు మాజీ అనికుమార్‌యాదవ్ ఎంతో కృషి చేశారన్నారు. నియోజకవర్గంలో తాను ఎన్నో పనులు చేశామని, మీరు చేసిన పని ఒకటి చూపించాలని సవాల్ విసిరారు. మా తండ్రి, నేను 9 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రులుగా పనిచేశామని, మేము ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నామన్నారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలోనే ఉండాలన్నారు. అదృష్టం బాగుండి ఈవీఎంలతో గెలిచి వీర్రవీగడం సరికాదన్నారు.

టీడీపీపై ప్రజల్లో తిరుగుబాటు : పర్వతరెడ్డి

ఏడాది కాలంలోనే అధికార టీడీపీపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత వచ్చిందని, త్వరలోనే తిరుగుబాటు తప్పని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీ రాజకీయాలు చేయబట్టే ఆయన ప్రతిష్ట ప్రజల్లో పెరుగుతుందన్నారు. ఈ సమయంలో కష్టపడే ప్రతి ఒక్కరికి మంచి రోజులు వస్తాయన్నారు. అధికార పార్టీ నేతలు సాగించే దురాగతాలకు తిరిగి వడ్డీ సహా చెల్లిస్తామన్నారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జంకే వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్లపరెడ్డి కుటుంబ గురించి మా ప్రాంతంలో కూడా చెప్పుకుంటారన్నారు. జగన్ ప్రభంజనం మరోసారి చరిత్ర సృష్టిస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు వీరి చలపతి, మండల కన్వీనర్లు అనూప్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, షాహుల్, సతీష్‌రెడ్డి, శ్రీనివాసులు, రాధాకృష్ణారెడ్డి, విజయకుమార్, శ్రీలత, నరసింహులురెడ్డి, దినేష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మీరారెడ్డి, నియోజక వర్గంలోని నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో లాభం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

పొదలకూరు: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకంగా ఉంటుందని, రసాయన ఎరువులను వాడాల్సిన అవసరం ఉండదని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. పొదలకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్లతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సదస్సులోఆయన మాట్లాడారు. జిల్లాలో 50 వేల మంది రైతులు, 80 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు అనుకూలంగా ఉందనే అంశాన్ని గుర్తించామని తెలిపారు. ఇందులో ప్రస్తుతం 19,962 మంది రైతుల వద్ద 22 వేల ఎకరాల్లో చేయిస్తున్నామని వెల్లడించారు. వీరికి పీఎమ్డీఎస్ కిట్లను పంపిణీ చేస్తామని, కిట్లలో 20 నుంచి 30 రకాల గింజలు ఉంటాయని వివరించారు. కిట్‌ను రూ.1200 చొప్పున రైతులు కొనుగోలు చేయాల్సి ఉంటుందని, విత్తనాలు పచ్చిరొట్ట ఎరువులుగా ఉపయోగపడతాయని వివరించారు. పొదలకూరు సబ్ డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల, సైదాపురం, మనుబోలు మండలాల్లో 5880 మంది రైతుల వద్ద 7719 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని వెల్లడించారు. ఏడీఏ శివనాయక్, ఏఓ ప్రతాప్, అడిషనల్ డీపీఎం మునిరత్నం, ఎస్ఎఫ్ఏ చంద్ర, శాస్త్రవేత్త రవిచంద్ర, కోటి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చప్పరోత్సవం, రాత్రి మల్ల యుద్ధం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో వివిధ పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా భీమిరెడ్డి మాల్యాద్రిరెడ్డి, పద్మ, గాలి చంద్రశేఖర్, సుభాషిణి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

గురుకుల విద్యార్థులకు రక్త పరీక్షలు



కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అమరావతి నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యాధికారి జ్ఞానేంద్ర మాట్లాడుతూ గురుకులాల్లోని విద్యార్థుల్లో రక్త హీనతతో పాటు ఇతరత్రా ఆరోగ్య సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్త గ్రూపు తెలుసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకొందని చెప్పారు. అనంతరం ఆయుర్వేద మందుల ప్రయోజనాలు, ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. గురుకులం ప్రిన్సిపల్ ప్రీతమ్ బిశ్వాస్, హెచ్ఏలు షఫీ ఉద్దీన్, ఒ.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు రేష్మా, పద్మజ, ఏఎన్ఎంలు టి.రాధమ్మ, రాధిక, ప్రశాంతి, ఆశా కార్యకర్తలు శీనమ్మ, కల్పన, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



పొదలకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలను ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ పర్సంటేజీలను వెల్లడించారు. ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్నెస్సెస్ ఆఫీసర్ నాహిద్, ఆరోగ్య సహాయకులు వెంకటేశ్వర్లు, కామాక్షమ్మ, అరుణ, పెంచలమ్మ, ప్రగతి, ఆశ వర్కర్లు రమాదేవి, పెంచలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన వైఎస్సార్‌సీపీ నినాదం



సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి పాల్గొన్న ప్రసన్న, అనిల్, పర్వతరెడ్డి

- విజయవంతంగా నియోజకవర్గ సమావేశం

కోవూరు: కోవూరులో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం విజయవంతంగా సాగింది. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని, వైఎస్సార్‌సీపీ నినాదాన్ని హోరెత్తించారు. తొలుత కోవూరు సాయిబాబా మందిరం నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి పార్టీ శ్రేణులు భారీగా కోవూరులోని సమావేశ మందిరానికి చేరుకున్నారు. దివంగత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన వీడియోను ప్రసన్నకుమార్‌రెడ్డి కార్యకర్తలకు చూపించారు. దీని ప్రకారం గ్రామంలో మనం ప్రజలను చైతన్య పరచాలన్నారు. పార్టీ సూచనల మేరకు అన్ని కార్యక్రమాలను చేపట్టాలన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సాగాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని, పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

సమష్టిగా నిలిచి.. ధైర్యంగా ఎదుర్కొందాం



రమణారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పూజిత

పొదలకూరు: అక్రమ కేసులకు భయపడాల్సిన పనిలేదని సమష్టిగా నిలిచి ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత పేర్కొన్నారు. మండలంలోని తోడేరులో తన తాత, మాజీ సమితి అధ్యక్షుడు కాకాణి రమణారెడ్డి ఘాట్ వద్ద సోమవారం నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తనకు వెంటనే సమాచారమివ్వాలని కోరారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలతో పాటు, ప్రజా మద్దతు తమకు ఉందన్నారు. మాజీ సర్పంచ్‌లు ఏనుగు శశిధర్‌రెడ్డి, అట్ల రవీంద్ర, పొదలకూరు ఎంపీటీసీ లక్ష్మీకల్యాణి, నేతలు అంజద్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్



మనుబోలు: పెద్ద శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలడంతో మనుబోలు మండల కేంద్రంలోని బీసీ కాలనీ వాసులు సోమవారం ఉలిక్కిపడ్డారు. కాలనీలో నివాసముంటున్న మీరా సాహెబ్ ఇంట్లో వంట కోసం మినీ గ్యాస్ సిలిండర్‌ను వినియోగిస్తున్నారు. వంట పూర్తి చేసుకొని పని నిమిత్తం కుటుంబ సభ్యులు బయటకెళ్లారు. ఎవరూ లేని సమయంలో సిలిండర్ పేలడంతో చుట్టుపక్కల వారు హడలిపోయారు. ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న నేతలు

తోటపల్లిగూడూరు: ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. జన సమీకరణలో భాగంగా వెంకన్నపాళెంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం సమ్మెను సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్నామని వివరించారు. నేతలు మోర్ల రాధయ్య, కందిపాటి రమణమ్మ, చింతా రామసుబ్బయ్య, చింతా శ్రవంత్, జడ్డా లెనిన్, నక్కల శీనయ్య, మన్నెం శీనయ్య, ఆములూరు వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.